# 1.07 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి

- మే నెల ప్రొడక్షన్ వివరాలు తెలిపిన ఆర్ఎఫ్‌సీఎల్
- తెలంగాణకు అత్యధికంగా 64,299 మెట్రిక్ టన్నుల సరఫరా




3

వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం 02-06-2026

# తెలంగాణలో పవన్ పెను ప్రభావం

## చాపకింద నీరులా విస్తరిస్తున్న జనసేన



- పవన్ సభను అడ్డుకోవడంతో హీట్ ఎక్కిన రాజకీయం
- కాంగ్రెస్ హటావో నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ పర్సనల్ గా తీసుకున్నారంటూ సోషల్ మీడియా లో పోస్టులు
- విమర్శలే బ్రహ్మాస్త్రాలుగా మారుతున్నాయా?
- జూన్ 2 సభ అనుమతుల నిరాకరణపైనే ప్రధాన చర్చ
- పవన్ ను టార్గెట్ చేయడం వెనుక రాజకీయ లెక్కలేనా?



2

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త చర్చ వేడెక్కుతోంది. “పవన్ కళ్యాణ్ ను ఎందుకు ఇంతగా టార్గెట్ చేస్తున్నారు?” అనే ప్రశ్న సామాన్య ప్రజల నుంచి రాజకీయ వర్గాల వరకు వినిపిస్తోంది. “తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ” ప్రకటించిన నాటి నుంచి ఆ సభను అడ్డుకోవడానికి జరిగిన పరిణామాలు చూస్తే, తెలంగాణలో పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో అర్థమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

డీ9 వార్త పొలిటికల్ బ్యూరో

## రామగుండంలో కఠిన నిబంధనలు కొనసాగింపు!!

- బహిరంగ మద్యం సేవనం, డీజే, అనుమతి లేని డ్రోన్లపై ఉక్కుపాదం
- ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరి

3



## నేడు రాఘవపట్నం, రంగాపూర్ లో మంత్రి సీతక్కపర్యటన



3

ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు నూతన పెన్షన్ల పంపిణీ

## నర్కుడలో ‘ఇందిరమ్మ’ ఇళ్ల గృహప్రవేశాలు

- లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 3,144 ఇళ్లు అందించడం సంతోషకరం
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

4



# తెలంగాణలో పవన్ పెను ప్రభావం



## చాపకింద నీరులా విస్తరిస్తున్న జనసేన

- పవన్ సభను అడ్డుకోవడంతో హీట్ ఎక్కిన రాజకీయం
- కాంగ్రెస్ హటావో నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ పర్సనల్ గా తీసుకున్నారంటూ సోషల్ మీడియా లో పోస్టులు
- విమర్శలే బ్రహ్మాస్త్రాలుగా మారుతున్నాయా?
- జూన్ 2 సభ అనుమతుల నిరాకరణపైనే ప్రధాన చర్చ
- పవన్   ను టార్గెట్ చేయడం వెనుక రాజకీయ లెక్కలేనా?
- తెలంగాణలో పెరుగుతున్న జనసైన్యం
- ప్రజలకు ఎవరిని ఎంచుకోవాలో బాగా తెలుసు అంటున్న జనసేన శ్రేణులు
- నాయకుల కంటే ప్రజలే ఎక్కువ రాజకీయ చైతన్యంతో ఉన్నారనే అభిప్రాయం

**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త చర్చ వేడెక్కుతోంది. "పవన్ కళ్యాణ్   ను ఎందుకు ఇంతగా టార్గెట్ చేస్తున్నారు?" అనే ప్రశ్న సామాన్య ప్రజల నుంచి రాజకీయ వర్గాల వరకు వినిపిస్తోంది. "తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ" ప్రకటించిన నాటి నుంచి ఆ సభను అడ్డుకోవడానికి జరిగిన పరిణామాలు చూస్తే, తెలంగాణలో పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో అర్థమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.**

**డీ9 వార్త పొలిటికల్ బ్యూరో**

మొదట ప్రొఫెసర్ నాగేశ్వరరావు చేసిన విమర్శలతో మొదలైన రాజకీయ దాడులు, చివరకు జూన్ 2న జరగాల్సిన సభకు అనుమతులు నిరాకరించే స్థాయికి వెళ్లడం ఇప్పుడు పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యంగా "కాంగ్రెస్ హటావో" నినాదాన్ని కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగతంగా తీసుకునే పోలీస్ అనుమతులు నిరాకరించారని సోషల్ మీడియా లో పోస్టులు ట్రెండ్ అవుతున్నాయి అనుమతుల నిరాకరించడం కాంగ్రెస్ నాయకత్వం వ్యక్తిగతంగా తీసుకుందా? అనే ప్రశ్న కూడా వినిపిస్తోంద అని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్ లో నిర్వహించాలనుకున్న సభకు పోలీసులు అనుమతి నిరాకరించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే — ఒక నాయకుడిని అడ్డుకోవడానికి ఇంత స్థాయిలో దిగజారుడు రాజకీయాలు చేయాలా అంటున్నారు జనసేన శ్రేణులు పవన్ ప్రభావం ప్రజల్లో చాలా గట్టిగా ఉందని. పవన్ కళ్యాణ్   ను కేవలం "ఆంధ్ర నాయకుడు"గా కాకుండా, తెలంగాణలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ స్వరంగా చూస్తున్న వర్గాలు పెరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే తెలంగాణ ప్రజల రాజకీయ అవగాహనను తక్కువ అంచనా వేయడం సరైంది కాదనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఆంధ్ర–తెలంగాణ భావోద్వేగాలు, ప్రాంతీయ రాజకీయాలు, ప్రజల మనస్తత్వం గురించి ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. నాయకులు అనుకునేంత అమాయకులు ప్రజలు కాదని, నిజానికి నాయకుల కంటే ప్రజలే ఎక్కువ రాజకీయ చైతన్యంతో ఉంటారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. నిజంగానే పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు దూరంగా కనిపిస్తే, ప్రజలే ఆయనను తిరస్కరిస్తారు. కానీ ఆ నిర్ణయం ప్రజలదే కావాలి గానీ, ముందుగానే కొందరు రాజకీయ నాయకులు తీర్పు చెప్పి అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఎవరి బలం ఏమిటి? ఎవరి బలహీనత ఏమిటి? అన్నది ప్రజల్లోకి వెళ్లి ప్రజల మధ్యే తేలాలి. కానీ కొందరు మాత్రం "ఒడ్డున కూర్చొని ఈత కొట్టొద్దు" అన్నట్టుగా, ప్రజల తీర్పు రాకముందే రాజకీయ లెక్కలు వేస్తున్నారని జనసేన శ్రేణులు విమర్శిస్తున్నాయి. ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు అనే సత్యాన్ని కొందరు మరిచిపోతున్నారనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్   పై కొందరు తెలంగాణ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. వ్యక్తిగత స్థాయిలో దూషణలు కూడా జరిగాయి. రాజకీయంగా ఒంటరిని చేయాలని ప్రయత్నాలు జరిగాయని జనసేన వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే పవన్ కళ్యాణ్ స్పందనలో మాత్రం నియంత్రణ కనిపించిందని ఆయన అనుచరులు చెబుతున్నారు. తనపై ఎంతటి విమర్శలు వచ్చినా, అదే భాషలో ప్రతిస్పందించకుండా విలువల రాజకీయాల గురించి మాట్లాడటమే ఆయన ప్రత్యేకతగా మారిందని అంటున్నారు. ఇదే ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ప్లస్ అవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే ప్రజలు ఇప్పుడు రాజకీయాల్లో కోపం కంటే సహనం, ద్వేషం కంటే బాధ్యత, మాటల యుద్ధం కంటే ఆలోచనాత్మక నాయకత్వాన్ని కోరుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ పై జరుగుతున్న ప్రతి రాజకీయ దాడి, ఆయనకు మరింత సానుభూతి తీసుకొస్తోందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్   కు ఉన్న అభిమాన వర్గం ఇప్పటికే బలంగా ఉంది. సినీ హీరోగా ఏర్పడిన ఆ అభిమానమే ఇప్పుడు రాజకీయ మద్దతుగా మారుతోంది. తెలంగాణ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ పేరు కేవలం సినీ గ్లామర్ వరకే పరిమితమని భావించిన వర్గాలు, ఇప్పుడు ఆయన చుట్టూ ఏర్పడుతున్న రాజకీయ చర్చను చూసి ఆశ్చర్యపోతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రత్యేకించి యువతలో పవన్ కళ్యాణ్   కు ఉన్న ఆదరణ ప్రత్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థపై ఆయన చేసే విమర్శలు, అవినీతి మరియు కుటుంబ రాజకీయాలపై ఆయన తీసుకునే వైఖరి తెలంగాణలో కొత్త రాజకీయ స్పేస్   ను సృష్టిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాపకింద నీరులా జనసేన తన బలాన్ని విస్తరించుకుంటోందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్న విషయం ఒక్కటే — పవన్ కళ్యాణ్   ను అడ్డుకోవాలని చేసే ప్రతి ప్రయత్నం, ఆయన రాజకీయ స్థాయిని మరింత పెంచుతోందనే అభిప్రాయం బలపడుతోంది. ఒక సభను ఆపవచ్చు, ఒక వేదికను నిరాకరించవచ్చు. కానీ ప్రజల్లో మొదలైన రాజకీయ చర్చను మాత్రం ఆపడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ ఇప్పుడు "మెయిన్ ఇష్యూ" తర్వాత వచ్చే పెద్ద రాజకీయ చర్చగా మారుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. అది పూర్తి స్థాయి రాజకీయ ప్రభావంగా మారడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే కొందరు నాయకుల్లో కనిపిస్తున్న అసౌకర్యానికి అసలు కారణమనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది.



# రామగుండంలో కఠిన నిబంధనలు కొనసాగింపు!!

- **బహిరంగ మద్యం సేవనం, డీజే, అనుమతి లేని డ్రోన్లపై ఉక్కుపాదం**
- **ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరి**
- **సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**
ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ మరోసారి కఠిన నిబంధనలను కొనసాగించింది. మంచిర్యాల, పెద్దపల్లి జోన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మరో నెల రోజుల పాటు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. వీధులు, రహదారులపై మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా మహిళలు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు జూన్ 1 నుంచి జూలై 1 వరకు అమల్లో ఉంటాయని, ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223తో పాటు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు భారీ శబ్దాలతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధాన్ని కొనసాగిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. విద్యార్థుల చదువులు, చిన్నారులు, వృద్ధులు, రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏ కార్యక్రమానికైనా మైక్ సెట్ వినియోగించాలంటే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. అనుమతి లేకుండా డ్రోన్ల వినియోగంపైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో భాగంగా జూన్ 1 ఉదయం 6 గంటల నుంచి జూలై 1 ఉదయం 6 గంటల వరకు ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉంటాయని కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. బందల పేరుతో సంస్థలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.

# 1.07 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి

- **మే నెల ప్రొడక్షన్ వివరాలు తెలిపిన ఆర్ఎఫ్సీఎల్**
- **తెలంగాణకు అత్యధికంగా 64,299 మెట్రిక్ టన్నుల సరఫరా**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**
రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) మే నెల ఉత్పత్తి గణాంకాలను యూనిట్ హెడ్ ఎస్.కే. జిందాల్ ప్రకటించారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్), ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎఫ్సీఐఎల్) భాగస్వామ్యంతో ఏర్పాటైన ఆర్ఎఫ్సీఎల్ సంస్థ 2021 మార్చి 22న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రస్తుతం సంస్థ ఉత్పత్తి చేస్తున్న వేపపూత యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తోంది. మేలో ఆర్ఎఫ్సీఎల్ ప్లాంట్ మొత్తం 1,07,883.45 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసింది. ఇందులో తెలంగాణకు అత్యధికంగా 64,299.15 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 8,175.15 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 11,305.26 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 7,900.47 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 8,291.07 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 7,912.35 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ యూనిట్ హెడ్ ఎస్.కే. జిందాల్ మాట్లాడుతూ, మే నెలలో 1,07,883.45 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యాన్ని విజయవంతంగా సాధించడంలో కీలక పాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులను అభినందించారు. అలాగే సంస్థకు సహకరించిన రాష్ట్ర, జిల్లా అధికారులకు, కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# ఉపాధిహామీ పనుల పని వేళల్లో మార్పు చేయాలి

**డీ డీ 9 వార్త, ములుగు :**
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామ చెరువులో కొనసాగుతున్న పూడిక తీత ఉపాధి హామీ పనుల్లో ప్రతిరోజూ సుమారు 100 మంది కూలీలు పాల్గొంటున్నారు. మండుతున్న ఎండల్లో కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పనివేళల్లో మార్పులు చేయాలని గ్రామస్థులు, కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ సందర్భంగా విలేజ్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ అశోక్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే పనులకు హాజరై మండుటెండల్లో ఉదయం 11 గంటల వరకు కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ములుగు జిల్లాలో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కూలీలు తీవ్ర ఎండ వేడిమిని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.తెలంగాణలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న జిల్లాల్లో ములుగు జిల్లా రెండో స్థానంలో ఉండటంతో కూలీల ఆరోగ్యంపై ఆందోళన నెలకొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మండుటెండల్లో పనిచేయడం వల్ల వడదెబ్బలు, నీరసం, డీహైడ్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ప్రస్తుతం అమల్లో ఉన్న నాలుగు గంటల ఆన్‌లైన్ అటెండెన్స్‌ను కనీసం మూడు గంటల పనిగా నమోదు చేయాలని, అలాగే కూలీలు ఒక గంట ముందుగానే పనులు ముగించుకొని సురక్షితంగా ఇళ్లకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూలీల ప్రాణ భద్రతను దృష్టిలో పెట్టుకొని తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా జూన్ 2న
# తెలంగాణ సంబరాలు

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో జూన్ 2న గోదావరి కళా ప్రాంగణం, జీఎం కాలనీ గ్రౌండ్‌లో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. ఈ కార్యక్రమాలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరింది. ఉదయం 8.30 గంటలకు జీఎం కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు జీఎం కార్యాలయం నుంచి “తెలంగాణ రన్” కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు గోదావరి కళా ప్రాంగణంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఆహార స్టాల్స్ ప్రారంభం, బహుమతుల ప్రదానోత్సవం, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, ప్రముఖ కళాకారులచే ధూంధాం ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కల్చరల్ షో నిర్వహించనున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంబరాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

# నేడు రాఘవపట్నం, రంగాపూర్ లో మంత్రి సీతక్కపర్యటన

- **ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు – నూతన పెన్షన్ల పంపిణీ**
- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు :పాలడుగు వెంకటకృష్ణ**



**గోవిందరావుపేట, జూన్ 1 ( డిడి 9 వార్త):**
తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం మండలంలోని రాఘవపట్నం, రంగాపూర్ గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో సీతక్క పాల్గొననున్నారు.
మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం పది గంటలకు రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ, వృద్ధులు మరియు వితంతువులకు నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటలకు రంగాపూర్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్నారు.
ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలకాలని వెంకటకృష్ణ పిలుపునిచ్చారు.



## భద్రాచలం ఐటీడీఏ డిడిగా చందన బాధ్యతల స్వీకరణ

**భద్రాచలం, జూన్ 1 , డిడి9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీమతి చందన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమెకు, ఇప్పటివరకు ఇన్చార్జి డిడిగా వ్యవహరించిన అశోక్ బాధ్యతలను అప్పగించారు.

అనంతరం, బాధ్యతలు స్వీకరించిన చందనను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) బి. రాహుల్ తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## మూతపడిన ఎస్సీ హాస్టల్ల పునరుద్ధరణకు డిమాండ్..

- **వెంకటాపురం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్..**

**జూన్01 డిడి 9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ వెంకటాపురం, వాజేడు మండలాల్లో నివసిస్తున్న దళిత సామాజిక వర్గాలు స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులతో సమానంగా నివసిస్తున్నప్పటికీ, విద్యా పరంగా ఇప్పటికీ తీవ్ర వెనుకబాటుతనంలో ఉన్నాయని,

ఈ ప్రాంతంలో దళిత విద్యార్థులకు సరైన విద్యా వసతులు లేకపోవడం, గతంలో నిర్వహించిన ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు మూతపడడం వల్ల విద్యార్థులు చదువుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలైన వెంకటాపురం, వాజేడు మండలాల్లోని పేద దళిత కుటుంబాలు తమ పిల్లలను దూర ప్రాంతాలకు చదువుకోడానికి పంపించలేని పరిస్థితుల్లో ఉండటంతో అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువును నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అందువల్ల వచ్చే విద్యా సంవత్సరానికి వెంకటాపురం, వాజేడు మండలాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి తమ ద్వారా నివేదిక పంపించాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ, సీనియర్ నాయకుడు మల్లేష్ మాదిగ, వాజేడు మండల ఇన్‌చార్జ్ యాసం మహేష్ మాదిగ, చిన్న తిరుపతి మాదిగ, ఆనంద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతిభకు ప్రోత్సాహం!!

- **విద్యార్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్**
- **ప్రారంభించిన ఆలయ ఫౌండేషన్ అధినేత నరహరి**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**

విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలకు సరైన మార్గదర్శనం అందించాలనే ఉద్దేశంతో ప్రముఖ ఐఏఎస్ అధికారి, ఆలయ ఫౌండేషన్ ఫౌండర్ నరహరి సోమవారం హైదరాబాద్ లో పెద్దపల్లి జిల్లా గ్రామీణ ప్రాంత స్టూడెంట్స్‌తో ప్రత్యేక విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమైన ఆయన విద్యా ప్రగతి, కెరీర్ లక్ష్యాలు, ఎదురవుతున్న సవాళ్లపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలపై విలువైన సూచనలు అందించారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, లక్ష్య సాధన పట్ల అంకితభావం ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అలాగే పిల్లలపై ఒత్తిడి పెంచకుండా వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల కెరీర్ సంబంధిత సందేహాల నివృత్తి, భవిష్యత్ ప్రణాళికల కోసం 7095915728 ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభించారు. ఈ నంబర్ ద్వారా విద్యార్థులు నేరుగా సంప్రదించి విద్య, కెరీర్, పోటీ పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకత్వం పొందవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన నరహరి గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎదుర్కొంటున్న అవకాశాల కొరత, కెరీర్ అవగాహన లోపం, ఆర్థిక సమస్యలపై చర్చించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి భవిష్యత్ లక్ష్యాలకు స్పష్టమైన దిశానిర్దేశం చేసిందని పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.




# నర్కుడలో ఘనంగా 'ఇందిరమ్మ' ఇళ్ల గృహప్రవేశాలు

- **లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**
- **రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 3,144 ఇళ్లు అందించడం సంతోషకరం**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ జూన్ 01 డిడి 9 వార్త**

తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాల ఉత్సవం శంషాబాద్ మండలంలో ఘనంగా నిర్వహించబడింది. ఇందులో భాగంగా సోమవారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా రిబ్బన్ కట్ చేసి,సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల కుటుంబాలకు నూతన గృహాలను అందజేశారు.

పేదవాడి సొంత ఇంటి కలే ప్రభుత్వ ధ్యేయం అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం విప్లవాత్మకంగా ముందుకు సాగుతోందని అన్నారు. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోనే 3,144 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. 'అందరికీ ఇల్లు సురక్షిత నివాసం' అనే లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, సమాజంలో సొంత గౌరవాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.నూతన ఇళ్లలోకి అడుగుపెడుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆయన శుభాభినందనలు తెలియజేశారు.తమ సొంత ఇంటి కల నెరవేరినందుకు నర్కుడ గ్రామ లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకేసారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పండుగ వాతావరణం నెలకొనడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు,గ్రామ పెద్దలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# తెలంగాణలో ప్రభుత్వ అద్దె వాహన యాజమాన్యుల ఆవేదన బిల్లుల పెండింగ్.!

- పెరుగుతున్న ఖర్చులు.! పట్టించుకోని వ్యవస్థ.!
- అధికారుల ప్రయాణం సాఫీ.! వాహన యాజమాన్యుల జీవితం కష్టాలమయం..!!
- బిల్లులు రావు.! బ్యాంకులు వదలవు..!!
- అద్దె వాహనాల యాజమాన్యాలకు ఆర్థిక సంక్షోభం.!
- ప్రభుత్వ సేవలో వాహనాలు.! నష్టాల్లో యాజమాన్యాలు..!!
- చక్రాలు తిరుగుతున్నాయి.! యాజమాన్యుల బతుకులు నిలిచిపోతున్నాయి..!!
- అధికారుల కార్లకు ఫుల్ ట్యాంక్.! యాజమాన్యుల జేబులు ఖాళీ..!!
- అధికారుల కోసం పరుగులు.! యాజమానులపై అప్పుల కొరడా..!!
- బకాయిల భారం.! అద్దె వాహనాల రంగం అస్తవ్యస్తం..!!
- నెలల తరబడి బిల్లుల బందీగా అద్దె వాహన యాజమాన్యాలు..!!
- వాహనాలు ప్రభుత్వానికి.! వడ్డీలు యాజమాన్యాలకు..!!
- ప్రభుత్వానికి సేవలందిస్తే ఇదేనా ప్రతిఫలం.!?
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.!
- 2017 సంవత్సరం నాటి బిల్లులే నేటికీ అమలు.!

**డీ డీ 9 వార్త, ములుగు :**

తెలంగాణ రాష్ట్రంలో ఉదయం ఆరు గంటలకు వివిధ ప్రభుత్వ శాఖలు జిల్లా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు, అలాగే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, మిషన్ భగీరథ, విద్యుత్ సంస్థలు, రెవెన్యూ, ఆరోగ్య, పోలీస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మైనింగ్, ఎక్సైజ్, తదితర శాఖల్లో వేలాది అద్దె వాహనాలను డ్రైవర్ సిద్ధం చేసి ఎదురుచూస్తూ సేవలందిస్తున్నారని, ప్రభుత్వ యంత్రాంగం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు సమర్థవంతంగా పనిచేయడంలో ఈ వాహనాల పాత్ర కీలకం. అయితే ప్రభుత్వానికి నిరంతరం సేవలందిస్తున్న అద్దె వాహన యజమానులు నేడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగమెరిగిన సత్యం.

**నెలల తరబడి బిల్లులు పెండింగ్:**

అద్దె వాహన యజమానులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, కొన్ని శాఖల్లో మూడు నుంచి ఆరు నెలల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మరి కొన్ని చోట్ల ఏడాది వరకు బకాయిలు పేరుకుపోయినట్లు యజమానులు చెబుతున్నారు. వాహనం నడిపిన వెంటనే డీజిల్ బంక్ యజమాని డబ్బులు అడుగుతాడని, ఫైనాన్స్ సంస్థలు నెలసరి వాయిదాలు కోరుతాయని, బీమా, పన్నులు, మరమ్మతుల ఖర్చులు కూడా తప్పడం లేదని, కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు సమయానికి రాకపోవడంతో యజమానులు అప్పుల పాలవుతున్నారని ఈ సందర్భంగా స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

**పెరిగిన ఇంధన ధరలు.! పాత అద్దె రేట్లు..!!**

గత కొన్నేళ్లలో డీజిల్, పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయని, వాహనాల విడిభాగాలు, టైర్లు, ఇంజిన్ ఆయిల్, బీమా ప్రీమియాలు కూడా గణనీయంగా పెరిగాయని, కానీ అనేక శాఖల్లో ఇప్పటికీ పాత 2017 సంవత్సరం నాటి అద్దె రేట్లే అమలవుతు ఉండడం విడ్డూరంగా ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో వాహన నిర్వహణ ఖర్చులు పెరిగినా అద్దె రేట్లలో మార్పులు లేకపోవడం వల్ల యజమానులకు లాభాలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అయితే నష్టాలను భరిస్తూ కేవలం ఒప్పందాలు చేసుకుందుకు మాత్రమే వాహనాలు నడుపుతున్న పరిస్థితి నెలకొంది.

**బ్యాంకుల రుణాల భారం:**

అనేక మంది యువకులు, మధ్యతరగతి కుటుంబాలు, బ్యాంకు రుణాలు తీసుకొని వాహనాలు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అద్దెకు ఇచ్చారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఈఎంఐలు చెల్లించలేక బ్యాంకుల ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో రుణ బకాయిల కారణంగా వాహనాలను స్వాధీనం చేసుకునే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వానికి సేవలందిస్తున్నప్పటికీ ఆర్థిక భద్రత లేకపోవడం వల్ల వారి ఆందోళనకు కారణమవుతోందని చెప్పవచ్చును.

**డ్రైవర్ల సంక్షేమం కూడా ప్రశ్నార్థకం:**

వాహన యజమానులతో పాటు డ్రైవర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్దిష్ట పని గంటలు లేకుండా ఎక్కువ సమయం విధులు నిర్వహించాల్సి వస్తోందని, అనేక ప్రాంతాల్లో డ్రైవర్లకు కనీస వేతనాలు, బీమా, ఆరోగ్య భద్రత వంటి సదుపాయాలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, ప్రభుత్వ సేవల కోసం రాత్రింబవళ్లు పనిచేసే డ్రైవర్ల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి



అవసరముందని సంఘాలు కోరుతున్నాయి.

**టెండర్ విధానంలో మార్పులు అవసరం:**

ప్రస్తుతం అమలవుతున్న కొన్ని టెండర్ నిబంధనలు చిన్న వాహన యజమానులకు ఇబ్బందికరంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఏజెన్సీలు మాత్రమే టెండర్లలో పాల్గొనే పరిస్థితి ఏర్పడుతుండటంతో, వ్యక్తిగత వాహన యజమానులు అవకాశాలు కోల్పోతున్నారని, చిన్న యజమానులకు కూడా సమాన అవకాశాలు కల్పించే విధంగా టెండర్ విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**తక్షణమే ప్రభుత్వం స్పందించాల్సిన సమయం ఇది:**

ప్రభుత్వ అద్దె వాహనాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరి సమస్యలు కేవలం ఒక వృత్తికి సంబంధించినవి మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, రవాణా రంగానికి కూడా ఇవి ముడిపడి ఉన్నాయని చెప్పవచ్చును.

**, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.**

2, ఇంధన ధరలకు అనుగుణంగా అద్దె రేట్లను సవరించాలి.

3, డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

4, బ్యాంకు రుణాల చెల్లింపులకు ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాలి.

5, టెండర్ విధానంలో పారదర్శకత పెంచాలి.

6, వాహన యజమానుల సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**ముగింపు:**

ప్రభుత్వ యంత్రాంగం సజావుగా నడవడంలో అద్దె వాహనాల పాత్ర అత్యంత కీలకమైనదని, అధికారులను గమ్యస్థానాలకు చేర్చడం నుంచి అత్యవసర సేవల వరకు ఈ వాహనాలు ప్రభుత్వానికి వెన్నెముకలా నిలుస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో అద్దె వాహన యజమానులు, డ్రైవర్లు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోవడం ఆందోళనకర విషయం. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఈ రంగం సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని వాహన యజమానులు హెచ్చరిస్తున్నారు.

# ఇంటి ముంగిట వెలిగిన ఆశల దీపాలు!!

- ఇందిరమ్మ ఇండ్లలో అడుగుపెట్టిన ఆనంద క్షణాలు
- పేద కుటుంబాల సొంతింటి కల సాకారం
- పేద కుటుంబాల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న కాంగ్రెస్
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**



పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ, ఎన్నో ఏళ్లుగా కంటున్న సొంత ఇంటి కలలు నెరవేరుతున్నాయి. రామగుండం నియోజకవర్గంలోని బసంత్ నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, రామారావుపల్లి, గోలివాడ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లలో గృహ ప్రవేశాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, లబ్ధిదారుల ఆనందాన్ని పంచుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటి గడప దాటిన కుటుంబాల ముఖాల్లో కనిపించిన సంతోషం, వారి కళ్లల్లో మెరిసిన ఆనందభాష్పాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు సొంత ఇంటి భద్రత లభించడం నిజమైన సామాజిక న్యాయమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్ ఠాకూర్, "ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. సొంత ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.. అది ఒక కుటుంబ భవిష్యత్తుకు బలమైన పునాది" అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలు శాశ్వత నివాస సౌకర్యాన్ని పొందుతున్నాయని, సంక్షేమ పాలనకు ఇది నిదర్శనమని చెప్పారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గృహ ప్రవేశ కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త ఇళ్ల యజమానులను అభినందించారు.



# ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య

**భద్రాచలం, జూన్ 1 , డిడి9 వార్త**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం, నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి శీఘ్ర దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు 'మేజిక్ రాజా'కు ప్రత్యేక ఆహ్వానం

- **కవితా పఠనం, ఇంద్రజాలం, వెంట్రిలాక్విజం ప్రదర్శనలకు ఎంపిక**



**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**
స్థానిక ప్రముఖ ఇంద్రజాలికుడు, కవి, కళాకారుడు, వ్యాఖ్యాత, వెంట్రిలాక్విస్ట్ అయిన మేజిక్ రాజాకు 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య-సాంస్కృతిక సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో జూన్ 6, 7 తేదీల్లో ఈ మహాసభలు నిర్వహించనున్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే అక్షర మహోత్సవంగా ఈ సభలు జరగనున్నాయి. దేశ, విదేశాల నుంచి ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారులు, భాషాభిమానులు పాల్గొననున్నారు.గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా జరిగే ఈ మహాసభల్లో కవితా పఠనం, ఇంద్రజాలం, మిమిక్రీ, వెంట్రిలాక్విజం విభాగాల్లో పాల్గొనాలని నిర్వాహకులు మేజిక్ రాజాను ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రణాళికా అధికారి డా. టి. పార్థసారథి డిజిటల్ ఆహ్వాన పత్రాన్ని పంపించారు. మేజిక్ రాజాకు ఈ అరుదైన అవకాశం లభించడం పట్ల సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



## సుభాష్‌నగర్ సమస్యలు పరిష్కరించాలి

- **సర్పంచ్‌కు వినతిపత్రం అందజేసిన వార్డు సభ్యుడు కావూరి గోపి**

**భద్రాచలం, జూన్ 1 , డిడి9 వార్త**

భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఏడవ వార్డు సభ్యులు కావూరి గోపి ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా కావూరి గోపి మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ కాలనీలో వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉందని, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలు, వీధి దీపాల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. గత మూడు నెలలుగా కాలనీలో శానిటైజేషన్ పనులు నిలిచిపోయాయని, దీనివల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. తక్షణమే శానిటైజేషన్ పనులను పునరుద్ధరించాలని సర్పంచ్‌ను కోరారు. బీఆర్ఎస్ నాయకులు కె.ప్రేమ్‌కుమార్, దుమాల రాజేశం, మారెడ్డి గణేష్, ప్రవీణ్‌కుమార్, రాంబాబు, సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలందాలి

- **ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**

**భద్రాచలం, జూన్ 1 , డిడి9 వార్త**



సుదూర ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి గిరిజన దర్బార్ లో దరఖాస్తులు చేసుకొన్న గిరిజనులకు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం నాడు ఐటిడిఏ సమావేశ మందిరంలో వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. దర్బార్‌లో గిరిజనులు సమర్పించిన అర్జీలలో పోడు భూముల పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారు కొరకు , మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు దరఖాస్తులందాయి. అలాగే నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకొనుట కొరకు, దీర్ఘకాలిక జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి శిక్షణలు ఇప్పించుట కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారని తెలిపారు. గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద కుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎఫ్ డి సి ఉదయ్ కుమార్, కొండరెడ్ల అధికారి గన్యా, ఏపీఓ పవర్ వేణు, ఏడిఎంహెచ్ఓ సైదులు, ఎల్ టి ఆర్ డి టి మనిధర్, డిఎం జిసిసి సమ్మయ్య, మిషన్ భగీరథ ఏ ఈ ఈ నారాయణరావు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, జేడీఎం హరికృష్ణ, ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హౌసింగ్ ఏఈ హేమంత్ ఇతర శాఖల సిబ్బంది మబ్బు ప్రసాద్, నరేందర్, వెంకటేశ్వర్లు, సుప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో డిసిల్టేషన్ రద్దు చేయాలని కలెక్టర్ కి ఫిర్యాదు..

- **నేషనల్ గ్రీన్ ట్రిబునల్ తీర్పును పరిశీలించాలి...**
- **సిపిఎం మండల కార్యదర్శి జ్ఞానం వాసు..**

**జూన్01 డిడి9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురం మండలంలో యాకన్నగూడెం నుండి ఆలుబాక వరకు గోదావరి నదిలో డీసిల్టేషన్ను రద్దు చేయాలని సోమవారం నాడు ములుగు జిల్లా కలెక్టర్కు సిపిఎం పార్టీ బృందం ఫిర్యాదు అందజేసింది ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతమ్మ బహుళార్ధ సాగర్ గడిచిన నాలుగు సంవత్సరాల క్రితం మూతపడిందని మూలన పడ్డ సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకటాపురం మండలంలో గోదావరిలో సుమారు నాలుగువేల ఎకరాలకు పైగా గోదావరిలో మూడు కోట్ల క్యూబిక్ మీటర్ల డీసిల్టేషన్ ( పూడికతీత ) ప్రభుత్వం నుండి అనుమతులు పొందేందుకు ఇసుక మాఫియా రంగం సిద్ధం చేసిందని కలెక్టర్కు వివరించారు
సీతమ్మ సాగర్ బడ్జెట్ 4 వేల కోట్లతో ప్రారంభమై 1600 కోట్ల పని మాత్రమే పూర్తి చేసిందని ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్లో కేవలం 330 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు.. నిధులు కేటాయించని ప్రాజెక్టు కింద డీసిల్టేషన్ ఎవరికోసం, ఎందుకోసం, చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు
గోదారి నదిలో కోట్ల క్యూబిక్ మీటర్ల తీయడం ద్వారా భూగర్భ జలాలు అంతరించిపోతాయని
తద్వారా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో పాటు గిరిజనేతల పేద రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు పర్యావరణం ప్రమాదంలో పడే ఇటువంటి చర్యలకు ప్రభుత్వం పునరు ఆలోచించాలని కోరారు మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాలలో భూగర్భ జలాలు ఆరిపోయి మంచినీటి సమస్య తలెత్తుతుందని ఇటువంటి సందర్భంలో ఇంత పెద్ద ఎత్తున ఇసుక ర్యాంపులకు కోట్లాది క్యూబిక్ మీటర్ల అనుమతుల ఇస్తే తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు
జిల్లాలో 56 సొసైటీలను క్రింద ఉన్న గిరిజన పేదల పొట్ట కొట్టేందుకు ఇసుక మాఫియా ముఠాకి ప్రభుత్వం వంతపడే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రత్నం రాజేందర్, రత్నం ప్రవీణ్ , ఎండి గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత బిల్డింగ్ పనులను పరిశీలించిన సీఎంఓ ప్రవీణ్ కుమార్

**బోనకల్,జూన్ 01,(డీడీ9 వార్త) :**
మండల పరిధిలోని ముష్టికుంట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న భవిత బిల్డింగ్ పనులను సోమవారం సమగ్ర శిక్షా అభియాన్ సీఎంఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.పనులను పరిశీలించిన సీఎంఓ ప్రవీణ్ కాంట్రాక్టర్ తో మాట్లాడుతు విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు కలర్స్ తో పాటు టాయిలెట్స్ పనులు పూర్తి పూర్తిస్థాయిలో పూర్తీ చేయాలని కంట్రాక్టర్ కి తెలిపారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య ఉన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ,అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- **ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం- ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 2:**



పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంరామగుండంనియోజకవర్గంలోని బసంత్ నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, రామారావుపల్లి, గోలివాడ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలుతెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో అనేక కుటుంబాలు శాశ్వత నివాస సౌకర్యాన్ని పొందుతున్నాయని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మణికొండ,పుప్పాలగూడపై కాంగ్రెస్ సర్కార్ వివక్ష

- **80 వేల ఓటర్లకు 2 సీట్లా.? 35 వేల ఉన్నచోట 3 ఇస్తారా?**
- **వార్డుల విభజనపై బీఆర్ఎస్ మండిపాటు**
- **ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లోనూ తీవ్ర అన్యాయం**
- **పన్నులు కట్టించుకోవడంలో ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదా?**
- **ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు**
- **బిఆర్ఎస్ నేత బి. ఉపేంద్రనాథ్ రెడ్డి ఆగ్రహం**

**రాజేంద్రనగర్ జూన్ 01 డిడి 9 వార్త**

నియోజకవర్గంలోని మణికొండ,పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజలపై అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్ర వివక్ష చూపుతోందని భారత రాష్ట్ర సమితి నాయకులు బి.ఉపేంద్రనాథ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నియోజకవర్గంలోని ప్రతి పౌరుడిని సమానంగా చూడాల్సిన బాధ్యతను విస్మరించి,ఒక ప్రాంతానికి ఒక విధంగా,మరో ప్రాంతానికి మరో విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.మణికొండ, పుప్పాలగూడ,నెక్నాంపూర్ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా సాగుతున్న ఈ వివక్షా పూరిత వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

**ఓటర్లు ఎక్కువ,సీట్లు తక్కువ.? ఇదేం లెక్క?**

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ, కేవలం 2 కార్పొరేటర్ (వార్డు) స్థానాలు మాత్రమే వచ్చే విధంగా నియోజకవర్గాల/వార్డుల పునర్విభజన ప్లాన్ చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఉపేంద్రనాథ్ రెడ్డి ప్రశ్నించారు. అదే సమయంలో పక్కనే ఉన్న నార్సింగి ప్రాంతంలో సుమారు 35 వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ 3 కార్పొరేటర్ స్థానాలు కేటాయించడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పుప్పాలగూడ ప్రాంతం ఉనికిని,అక్కడి ప్రజల ఓటు హక్కుల విలువను తగ్గించే విధంగా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇండ్లలోనూ భారీ స్కామ్. ప్రభుత్వ పథకాల పంపిణీలోనూ ఈ ప్రాంతాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఉపేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు.కేవలం నార్సింగి ప్రాంతంలోనే 198 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో అవకాశం కల్పించారు.కానీ,అంతకంటే పెద్దదైన మణికొండ, పుప్పాలగూడ,నెక్నాంపూర్ ప్రాంతాలన్నింటినీ కలిపి కేవలం 100 మందికి మాత్రమే అవకాశం ఇవ్వడం ఏ రకమైన న్యాయం.?" అని నిలదీశారు. ప్రభుత్వం విధించే అన్ని రకాల పన్నులను ఈ ప్రాంత ప్రజలు సక్రమంగా కడుతున్నప్పుడు,హక్కుల కేటాయింపుల్లో ఎందుకు ఇంత చిన్న చూపు చూస్తున్నారో ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



**స్థానిక కాంగ్రెస్ నాయకుల నోళ్లకు తాళాలు**

ఈ ప్రాంత ప్రజలకు ఇంత పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతున్నా,మణికొండ ప్రాంత కాంగ్రెస్ నాయకులు గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అడ్డగోలు హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా,ప్రజలపై వివక్ష జరుగుతున్నప్పుడు నిలబడి పోరాడాల్సిన కనీస బాధ్యత కూడా కాంగ్రెస్ నాయకులకు లేదా అని విమర్శించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే బీఆర్ఎస్,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తుందని,మణికొండ, పుప్పాలగూడ,నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని బి. ఉపేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్ధిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

- **లక్ష్మిగూడలో విషాదం**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**రాజేంద్రనగర్ జూన్ 01 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ పరిధిలోని లక్ష్మిగూడలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం ప్రకారం...లక్ష్మిగూడకు చెందిన సాయిలు (35) గత పదేళ్లుగా బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నాడు.ఇటీవల వ్యాపారం సరిగా సాగక అప్పుల్లో కూరుకుపోయి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వచ్చిన ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు తెలిసింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# డిపెండెంట్‌ల ఉద్యోగాల కోసం జూన్ 3న ధర్నా

- **అర్జీవన్ జీఎం కార్యాలయం ముట్టడికి ఏఐటియుసి పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 01 (డిడి9 వార్త):**



సింగరేణిలో డిపెండెంట్‌లకు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామక ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 3న అర్జీవన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటియుసి ఆర్జీ 1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తెలిపారు.

ఆయన మాట్లాడుతూ..., కారుణ్య నియామకాల కింద అర్హత పొందిన 400 మందికి పైగా డిపెండెంట్‌లు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పటి వరకు నియామక పత్రాలు అందలేదన్నారు. రెండేళ్లుగా నిరుద్యోగంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్‌ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 3న ఉదయం 10 గంటలకు అర్జీవన్ జీఎం కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో డిపెండెంట్‌లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఆరాంఘర్ టూ జూ పార్క్ సర్వీస్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి

- **ర్యాంపు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి**
- **అధికారులకు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆదేశం**

**రాజేంద్రనగర్ జూన్ 1 డిడి 9 వార్త**



ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూ పార్క్ వరకు ఫ్లైఓవర్ కింద ఇరువైపులా కొనసాగుతున్న సర్వీస్ రోడ్ల అభివృద్ధి పనులను సోమవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు .ఈ సందర్భంగా ఫ్లైఓవర్ కింద ఇరువైపులా చేపడుతున్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్,ర్యాంపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రతిరోజూ వేలాది వాహనదారులు ఈ మార్గాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ పర్యటనలో ప్రాజెక్ట్ ఇంజినీరింగ్,టౌన్ ప్లానింగ్,యూబీడీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్‌లో తక్కువ ధరకే పాఠశాల సామాగ్రి: ఐటీడీఏ పీఓ బి.రాహుల్

**భద్రాచలం , జూన్ 1 డిడి9 వార్త**



భద్రాచలంలోని విద్యార్థుల తల్లి దండ్రులకు ఐటీడీఏ శుభవార్త అందించింది. పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల నోట్ బుక్స్, స్టేషనరీ సామాగ్రిని భద్రగిరి మార్ట్‌లో సరసమైన ధరలకే విక్రయిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అన్ని వస్తువులూ ఒకే చోట..

పాఠశాలలకు అవసరమైన నోట్ బుక్స్‌తో పాటు జామెట్రీ బాక్సులు, స్కూల్ బ్యాగులు తదితర విద్యా సంబంధిత మెటీరియల్ అంతా భద్రగిరి మార్ట్‌లో అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు. బయటి మార్కెట్‌తో పోలిస్తే నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే విక్రయిస్తున్నామని వివరించారు.

అభివృద్ధికి సహకరించండి

తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాహుల్ కోరారు. భద్రగిరి మార్ట్‌లో పాఠశాల అవసరాలకు సంబంధించిన సామాగ్రిని కొనుగోలు చేయడం ద్వారా, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి: భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్

**భద్రాచలం, జూన్ 1 డిడి9 వార్త**

భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం అక్కడికి విచ్చేసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ఆటో యూనియన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజా భద్రత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు





# నార్సింగి 'ఇందిరమ్మ' భూములపై కబ్జా కోరలు







- **ప్రభుత్వ హెచ్చరిక బోర్డుకే రంగు పూసిన భూబకాసురులు**
- **దళిత లబ్ధిదారులకు బెదిరింపులు**
- **రంగారెడ్డి కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు**
- **కోట్ల రూపాయలు విలువైన సర్వే నెం.298/P భూమిని కాపాడాలని వేడుకోలు**

**రాజేంద్రనగర్ జూన్ 01 డిడి 9 వార్త**

గండిపేట మండలం నార్సింగి పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై భూబకాసురుల కన్ను పడింది.నాడు నిరుపేద దళితుల జీవనోపాధి కోసం కేటాయించిన స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకోవడానికి బడాబాబులు యత్నిస్తుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. రాత్రికి రాత్రే ప్రభుత్వ హెచ్చరిక బోర్డుకు రంగులు పూసి,అక్షరాలను చెరిపివేస్తూ కబ్జాదారులు సాగించిన తెగింపుపై దళిత సంఘాలు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాడు కోళ్ల ఫారం - నేడు రియల్ దందా**

గతంలో 1981వ సంవత్సరంలో నాటి ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నార్సింగి గ్రామానికి చెందిన 30 మంది నిరుపేద దళితులను గుర్తించి,వారి ఉపాధి కోసం సర్వే నంబర్ 298/పి లోని 2 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు.ఒక్కొక్కరికి 242 గజాల చొప్పున ఇచ్చిన ఈ స్థలంలో ప్రభుత్వమే మూడు దఫాలుగా కోడి పిల్లలను పంపిణీ చేసి కోళ్ల ఫారాలను ఏర్పాటు చేయించింది.అయితే, అప్పట్లో వచ్చిన తీవ్రమైన తెగుళ్ల కారణంగా కోళ్లు మృతి చెందడంతో ఆ పథకం మధ్యలోనే నిలిచిపోయింది. ఆర్థిక స్తోమత లేక లబ్ధిదారులు తిరిగి వ్యాపారం ప్రారంభించలేకపోయారు.ఆ తర్వాత భూమి రక్షణ కోసం ఎస్సీ కార్పొరేషన్ అధికారుల సూచన మేరకు,ఇది ప్రభుత్వ స్థలం,ఇందులో ఎటువంటి క్రయ విక్రయాలు జరుపకూడదని అక్కడ ఒక బోర్డును ఏర్పాటు చేశారు.

**ఆకాశాన్నంటుతున్న ధరలు - బడాబాబుల బెదిరింపులు**

ప్రస్తుతం నార్సింగి ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో, కొంతమంది బడా వ్యాపారవేత్తలు,కబ్జాదారుల కన్ను ఈ భూమిపై పడింది. రెండు రోజుల క్రితం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే ఆ ప్రభుత్వ బోర్డుపై పసుపు రంగు వేసి, అక్షరాలను చెరిపివేశారు. అంతేకాకుండా,ఆ స్థలంలోకి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు.

**కలెక్టరేట్ మెట్లెక్కిన బాధితులు**

తమకు కేటాయించిన భూమిని కబ్జాదారుల నుండి కాపాడి,తమకు పూర్తి హక్కులు కల్పించేలా 'పట్టాలు 'మంజూరు చేయాలని బాధితులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి వినతి పత్రం అందించారు.నార్సింగి గ్రామ ఎస్సీ వర్గ లబ్ధిదారుల కమిటీ ఆధ్వర్యంలో భూమికి సంబంధించిన అన్ని రకాల పాత పత్రాలను అధికారులకు అందజేశారు.

**అప్పట్లో ఇందిరమ్మ ఇచ్చిన భూమే మాకు ఆధారం**

ఇప్పుడు ఇక్కడ గజం భూమి లక్షల్లో పలుకుతుండటంతో అక్రమార్కులు మా స్థలాన్ని లాక్కోవాలని చూస్తున్నారు. మమ్మల్ని బెదిరిస్తున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి, కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.మా భూమిని మాకు దక్కేలా చూడాలని ,బాధితుల ఆవేదన కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దయాకర్,క్రాంతి,విశ్వనాథం, సుధీర్,విశాల్,కీర్తి,రాజ్ శేఖర్ తదితరులు వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

## మండల నూతన తాసిల్దారుగా సిహెచ్ సుధాకర్ బాధ్యతలు స్వీకరణ

**బోనకల్,జూన్01,(డీడీ9 వార్త) :**



మండలం నూతన తహశీల్దారుగా సి ఎచ్.సుధాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మండల తహశీల్దారు గా పని చేసిన మద్దెల రమాదేవి నల్లగొండ జిల్లా డిప్యూటీ జిల్లా కలెక్టర్ గా ఉద్యోగున్నతి పొందారు,ప్రస్తుతం కామేపల్లి మండల తహశీల్దారుగా పని చేస్తున్న సుధాకర్ మండల తహసీల్దారు గా నియమితులయ్యారు.ఈ సంధర్బంగా నూతన తహసీల్దారు సుధాకర్ మాట్లాడుతు రెవిన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కారం చేస్తానని ఆయన విలేకరులకు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన సుధాకర్ కు రెవిన్యూ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ తహసీల్దార్ గుగులోతు లక్ష్మణ్ నాయక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

# పోలీసుల ఉత్తమ సేవలకు పతకాల పంట

**చర్ల, జూన్ 1 (డిడి 9 వార్త )**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 ను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం పోలీసులకు అందించే ప్రతిష్టాత్మక పతకాలను చర్ల మండలానికి చెందిన పోలీస్ ఇన్స్పెక్టర్ ఆలెం రాజు వర్మ కు శౌర్య పతకం ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏజెన్సీ ప్రాంతంలో ఆయన అందించిన విశిష్ట సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడం, యువతకు మత్తు పదార్థాలు వాటి ప్రభావం పై అవగాహన సదస్సులు నిర్వహించడం, స్నేహపూర్వక విధి నిర్వహణ, పేదలకు చేయూత, పేదక్రీడాకారులకు ఆర్థిక సాయం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహించిన రాజు వర్మ కు రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు ఇచ్చి సత్కరించడం అభినందనీయమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కఠిన సేవా పతకానికి ఎంపికైన సబ్ ఇన్స్పెక్టర్ పడాల కేశవ్ ను మండల ప్రజలు అభినందించారు. ఆయన అందించిన సేవలకు గాను ఈ అవార్డు లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మరో ఇద్దరు పోలీసులకు అవార్డులు లభించాయి. ఉత్తమ సేవలు అందించిన హెడ్ కానిస్టేబుల్ లింగపోగు రాంబాబు, పోలీస్ కానిస్టేబుల్ పేటి రాము లకు కఠిన సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మండల పోలీసులకు అవార్డులు రావడం ఆనందదాయకమని భవిష్యత్తులో ఇంకా ఎన్నో అవార్డులను అందుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.



